సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం, 4, ఆగస్టు, 2024



దోస్తానా.. నయా జమానా..



ఒకప్పుడు పుట్టి పెరిగిన ప్రాంతం, చదువుకునే పాఠశాల, ఆడుకునే మైదానం, ఆకతాయి కబుర్లు చెప్పుకునే పిట్టగోడలే కేంద్రాలుగా స్నేహాలు వర్ధిల్లేవి. అయితే కాలం గడుస్తుండగా.. జీవిత ప్రయాణంలో ముందుకు సాగుతున్న కొద్దీ ఈ మిత్రుత్వాలు పలుచనయ్యేవి. మనుషులు, మనసుల మధ్య కూడా అంతరం పెరిగేది. కానీ సోషల్ మీడియాతో సమాచార వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. దీంతో మనుషుల మధ్య దూరం చెరిగిపోయి మునుపెన్నడూ లేనంతగా పాత స్నేహాలు బలంగా పెనవేసుకుంటు న్నాయి అనేందుకు స్మార్ట్‌ఫోన్ ఉపయోగిస్తున్న వారంతా ప్రత్యక్ష సాక్షులే. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

- సోషల్ మీడియా వేదికగా బలపడుతున్న ఫ్రెండ్‌షిప్
- చిన్ననాటి స్నేహితులను కలుపుతున్న వాట్సాప్ గ్రూపులు
- ఇటీవల పెరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు
- సామాజిక మాధ్యమాలతో అండగా నిలుస్తున్న మిత్రులు

నేడు అంతర్జాతీయ ఫ్రెండ్‌షిప్ డే

వాట్సాప్ గ్రూపుల హవా..

సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చిన తర్వాత సమాచార వ్యాప్తిలో సామాన్యులు కూడా భాగస్వాములయ్యారు. ఒకప్పుడు ఉత్తరాలు, ఆ తర్వాత కాలంలో ఫోన్లలో మాట్లాడుకునే స్థాయి నుంచి సోషల్ మీడియా సాయంతో దేశ విదేశాల్లో ఉంటున్న వారు సైతం వీడియో కాల్స్ ద్వారా సంభాషణలు సాగిస్తున్నారు. నిత్య జీవితంలో ఎదురయ్యే అనుభవాలు, మార్పులు చేర్పులను ఎప్పటికప్పుడు షేర్ చేసుకునే సదుపాయం వచ్చింది. ముఖ్యంగా వాట్సాప్ గ్రూపులతో సామాజిక సంబంధాల్లో ఊహించని మార్పు వచ్చింది. 90 శాతం మంది మొబైల్ ఫోన్లలో మై ఫ్యామిలీ, టెన్త్ క్లాస్, ఇంటర్, డిగ్రీ పేర్లతో తప్పనిసరిగా వాట్సాప్ గ్రూపులు ఉంటున్నాయి. ఈ గ్రూపుల ద్వారా చిన్ననాటి దోస్తుల నుంచి ఆఫీసులో కొలీగ్స్ వరకు అందరూ నిత్యం టచ్‌లో ఉంటున్నారు. వారి దైనందిన జీవితంలో జరిగే మంచి చెడులను ఎప్పటికప్పుడు పంచుకుంటున్నారు. శుభాకాంక్షలు చెప్పుకుంటున్నారు.

గెట్ టు గెదర్..

ప్రపంచీకరణలో వచ్చిన మార్పులతో వృత్తిగత జీవితంలో పోటీ పెరిగింది. దీంతో సొంత ఊరిని వదిలి పట్టణాలు, నగరాలకు వెళ్లక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. చిన్నప్పటి దోస్తులను కలవాలంటే పెళ్లిళ్లు, పేరంటాలు.. లేదంటే ఊరి జాతరలే వేదికలయ్యేవి. ఇవి కూడా ఎప్పుడో ఒకసారి జరిగేవి. కానీ గత ఐదారేళ్లలో చిన్నప్పటి స్కూల్ ఫ్రెండ్స్ అంతా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు నిర్వహించుకోవడం పెరిగిపోయింది. దీనికి ప్రధాన కారణం వాట్సాప్ గ్రూపులే. ఒకరు పరిచయమైతే చాలు వారం, పది రోజుల్లోనే ఒకరి తర్వాత ఒకరి కాంటాక్ట్ నంబర్లు సాధించడం, అందరినీ గ్రూపుల్లో చేర్చడం చక చకా జరిగిపోతున్నాయి. బిజీ లైఫ్‌లో పరిగెట్టే మనిషికి చిన్ననాటి దోస్తులు వాట్సాప్ గ్రూపుల్లో 'అరేయ్, ఒరేయ్' అని పిలుస్తుంటే వయసు ఒక్కసారిగా తగ్గిపోయినట్టు అనిపిస్తోంది. పాఠశాల రోజుల్లో చేసిన అల్లర్లు గుర్తు చేసుకుంటూ, అప్పటి ముద్దుపేర్లతో ఆటపట్టిస్తుంటే ఆ వ్యక్తి జీవితంలో స్ట్రెస్ బస్టర్‌గా మారుతోంది. గ్రూప్ ఏర్పాటైన నెల నుంచి రెండు నెలల్లోగానే అంతా కలిసి చాట్ చేసుకోవడంతో పాటు వీడియో కాన్ఫరెన్స్‌ల్లో బాతాఖానీ కొడుతున్నారు. అంతటితో ఆగనివాళ్లు మరో అడుగు ముందుకేసి పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు ఏర్పాటు చేస్తున్నారు.

ఆపదలో అండగా నిలుస్తూ..

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లోని గ్రూపుల్లో లేదంటే పూర్వ విద్యార్థుల సమ్మేళనాల్లో తమ చిన్ననాటి మిత్రులు ఆపదలో ఉంటే ఆదుకునేందుకు అంతా ముందుకొస్తున్నారు. విషయాన్ని గ్రూపులో చర్చకు పెట్టడం, సాయం చేయాలని నిర్ణయించుకోవడం, ఆ తర్వాత ఒక్కొక్కరుగా యూపీఐ పేమెంట్లు ఒకరికి చేయడం, ఆ వ్యక్తి వెళ్లి ఇబ్బంది పడుతున్న దోస్త్‌కు సాయం అందించడం వంటివి వెనువెంటనే జరిగిపోతున్నాయి. జీవితంలో వెనకబడిన వారికి తోడ్పాటు అందించేందుకూ సిద్ధమవుతున్నారు.

జాగ్రత్తలూ అవసరమే..

ఇక సోషల్ మీడియా ముసుగులో కొందరు అర్జంట్ అవసరం అంటూ, నగదు బదిలీ చేయాలని కోరుతూ మోసాలకు తెగబడుతున్నారు. మరికొందరు అమ్మాయిల ఫొటోలు డీపీగా పెట్టుకుని ఫ్రెండ్స్‌తో చాటింగ్ చేస్తూ స్నేహం అనే పదానికి మచ్చ తెస్తున్నారు.

ప్రతీ సమాచారం వాట్సాప్‌లోనే..



మా గ్రామ పూర్వ విద్యార్థులు, ఉద్యోగులు 'బాణాపురం డైనమెట్స్' పేరిట వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేశారు. గ్రామంలో ఉంటున్న వారితో హైదరాబాద్, ఖమ్మమే కాక ఇతర రాష్ట్రాలు, దేశాల్లో స్థిరపడిన 528 మంది సభ్యులు ఉన్నారు. గ్రామంలో ఉంటున్న మేం మంచీ, చెడు ఏ సమాచారమైనా పోస్ట్ చేస్తాం. దీంతో అందరికీ తెలియడమే కాక అవసరమైన సందర్భాల్లో స్పందిస్తారు. ఈ గ్రూప్ ద్వారా ఎక్కడ ఉన్నా అంతా ముఖాముఖి మాట్లాడుకున్నట్లే అనిపిస్తుంది.

– మరికంటి నాగేశ్వరరావు, బాణాపురం డైనమెట్స్ గ్రూప్

వారధిగా నిలుస్తోంది..



10వ తరగతి వరకు బాణాపురంలో చదువుకున్న మేం 'ఫ్రెండ్స్ ఫర్‌ఎవర్' పేరిట 2015లో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటుచేశాం. తద్వారా ఎక్కడెక్కడో స్థిరపడిన చిన్ననాటి స్నేహితులమంతా సంతోషాలే కాక కష్టాలనూ పంచుకుంటున్నాం. ఆపద సమయంలో తోటి మిత్రులు, వారి కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు ఈ గ్రూప్ వారధిగా నిలుస్తోంది. ఎవరికైనా కష్టం వస్తే అందరం ఏకమవడాన్ని గర్వంగా భావిస్తాం. స్నేహబంధం గొప్పదనానికి మా గ్రూపే ఉదాహరణ.

– దీకొండ వెంకటేష్, ఫ్రెండ్స్ ఫర్‌ఎవర్ గ్రూప్ సభ్యుడు



సాక్షి - కేఎండీసీ ఆధ్వర్యాన నిర్వహించిన డిబేట్‌లో మాట్లాడుతున్న విద్యార్థులు

స్నేహ మాధుర్యం..



భవిష్యత్ నిర్దేశకులు దోస్త్‌లే

- ఎంచుకునే వేళ జాగ్రత్త పడితే సరి
- తల్లిదండ్రులు కూడా బెస్ట్ ఫ్రెండ్సే..
- సాక్షి – కేఎండీసీ డిబేట్‌లో విద్యార్థుల మనోగతం

ఖమ్మం సహకారనగర్: స్నేహం మధురమైనదంటారా? కాదు అంతకన్నా ఎక్కువే! స్నేహం విలువ, అర్థం మాటల్లో చెప్పడానికి వీలు కాదు. ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి మరెక్కడో ఏర్పడే పరిచయం స్నేహంగా మారి విడదీయరాని బంధంగా బలపడుతుంది. అది స్కూల్, కళాశాల లేదా కార్యాలయం ఎక్కడైనా కావొచ్చు. ఎంచుకునే వేళ కాస్త జాగ్రత్త పడుతూ మన ఆంతరంగాన్ని పోలి ఉండే వారిని స్నేహితులుగా మార్చుకుంటే ఆ బంధం ఇక ఎన్నటికీ వీడిపోదు. నేడు (ఆదివారం) స్నేహితుల దినోత్సవం సందర్భంగా సాక్షి మీడియా, కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల(అటానమస్) సంయుక్త ఆధ్వర్యాన డిబేట్ నిర్వహించగా డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులు స్నేహబంధం, స్నేహితులపై తమ అభిప్రాయాలు వెల్లడించారు.

స్వార్థం లేకపోతేనే స్వచ్ఛత

భవిష్యత్‌కు స్నేహితులే మార్గదర్శకులుగా నిలుస్తారని పలువురు విద్యార్థులు అభిప్రాయపడ్డారు. ఇలాంటి స్నేహితులు చిన్నతనం నుంచి ఉన్నత స్థాయికి చేరే వరకు ఎక్కడున్నా గుర్తుండి పోతారని తెలిపారు. అయితే, హోదాను బట్టి కాక స్వార్థం లేకుండా కొనసాగితేనే స్వచ్ఛమైన స్నేహమని చెప్పారు. సంతోషాన్ని పంచుకోవడంతో పాటు కష్టం వచ్చినప్పుడు కూడా నేనున్నానంటూ భరోసాగా నిలవడమే గొప్పతనమని అన్నారు.

మారుతున్న స్నేహాలు

గతంలో ముఖాముఖి పరిచయం ఉన్న వారే స్నేహితులుగా మారగా.. ఇప్పుడు ఆన్‌లైన్ స్నేహాలు పెరిగాయని పలువురు చెప్పుకొచ్చారు. ఇష్టాఇష్టాలు, ఇతర అంశాల ఆధారంగా ఒకరికొకరు పరిచయం అవుతున్నారని.. ఆపై స్నేహంగా మారుతోందని తెలిపారు. అయితే, ఇలాంటి విషయాల్లో కాస్త జాగ్రత్తగా ఉండాలని పలువురు అభిప్రాయపడ్డారు.

అమ్మానాన్నలూ మిత్రులే..

కొందరు తల్లిదండ్రులు సైతం తమ పిల్లలతో బెస్ట్ ఫ్రెండ్స్‌లానే ఉంటారని విద్యార్థులు చెప్పుకొచ్చారు. మనం కొన్ని విషయాలు చెప్పడానికి సంకోచించినప్పటికీ.. అన్నీ చెప్పుకుంటే స్నేహితుల్లా స్వీకరించేందుకు వారు ముందుంటారని తెలిపారు. కరోనా తర్వాత తల్లిదండ్రులతో స్నేహం పెరిగిందని కొందరు చెప్పగా.. ఇంకొందరు మాత్రం ఆన్‌లైన్ స్నేహం సైతం పెరిగిందని వెల్లడించారు. కాగా, ఈ డిబేట్‌లో కేఎండీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వీ.రమణారావు, అధ్యాపకులు, ఉద్యోగులు పాపారావు, కమల్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఎంపికే ప్రధానం



మనం స్నేహితులను ఎంచుకునేటప్పుడే జాగ్రత్త పడాలి. తద్వారా మంచి స్నేహితుల సాంగత్యంలో భవిష్యత్‌కు బాటలు పడతాయి. స్నేహితులంటే నమ్మకానికి మారుపేరు. ఆ నమ్మకంలో తేడా రాకుండా ఉంటేనే విలువ ఉంటుంది. – జి.మేఘమాల

స్నేహంతో విజయం



ప్రస్తుత పరిస్థితుల్లో నిజమైన స్నేహం కావాలి. అలాంటి స్నేహం ఏర్పడితేనే విజయాలు సాధ్యమవుతాయి. ఈ సమయాన మంచీచెడులపై సమగ్రంగా విచక్షణ కలిగి ఉండాలి. తద్వారా స్నేహితులు మన ఉన్నతి, విజయాలకు దోహదపడతారు. – వంశీకృష్ణ

మా పేరెంట్సే బెస్ట్ ఫ్రెండ్స్



నాకు మా తల్లిదండ్రులే బెస్ట్ ఫ్రెండ్స్. నేను ప్రతీ విషయాన్ని మొదట వారికే చెబుతా. నాకు చిన్నప్పటి నుంచి స్నేహితులు ఉన్నప్పటికీ నేను అమ్మానాన్నలే బెస్ట్ ఫ్రెండ్స్‌గా ఫీలవుతా. వారు సైతం నాతో అలాగే ఉండడాన్ని అదృష్టంగా భావిస్తా. – మైలవరపు సరయు

ఆలోచనలు కలవాలి..



ప్రస్తుతం లైక్ మైండెడ్ ఫ్రెండ్స్ కావాలి. చదువు, ఎంచుకునే రంగాల్లో ఇద్దరి ఆలోచనలు ఒకేలా ఉంటే వారి స్నేహం బలంగా కొనసాగుతుంది. అంతేకాక ఎవరైనా తప్పుదారి పడితే సరిచేసే అవకాశముంటుంది. అలాగే, స్నేహం నిజాయితీగా ఉండాలి. – మహేష్

పరస్పరం.. అర్థం



స్నేహమంటే ఒకరిని ఒకరు అర్థం చేసుకోవడం. అలాగే, పరస్పరం పూర్తి నమ్మకాన్ని కలిగి ఉండాలి. కష్టాలు, బాధలు వచ్చినా ఎలాంటి పరిస్థితులు ఎదురైనా నేనున్నానని భరోసా ఇవ్వాలి. అలాంటి స్నేహితులు ఉన్నవారు విజయం సాధిస్తారు. – గాయత్రి

మరువలేనిది.. మరుపురానిది



మరువలేనిది.. మరుపురానిదే స్నేహం. పాఠశాల స్థాయి నుంచి డిగ్రీకి వచ్చినా స్నేహితులను మరిచిపోలేదు. కొందరి జీవితాల్లో స్నేహితులే హీరోలు. చదువు, ఉద్యోగ విషయాల్లో అండగా నిలిస్తే ఉన్నత స్థానాలకు సులువుగా చేరుకునే అవకాశం ఉంటుంది. – ప్రదీప్

న్యూస్‌రీల్

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి శనివారం వైభవంగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజా మున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శాస్త్రీయ అవగాహన పెంపొందించాలి



మాట్లాడుతున్న జిల్లా సైన్స్ అధికారి చలపతి రాజు

ఇల్లెందు: విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన పెంపొందిస్తే భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా ఎదిగే అవకాశం ఉంటుందని జిల్లా సైన్స్ అధికారి ఎస్.చలపతిరాజు అన్నారు. స్థానిక సింగరేణి స్కూల్‌లో శనివారం ఇల్లెందు, గుండాల, ఆళ్లపల్లి, టేకులపల్లి మండలాల ఉపాధ్యాయులకు ఇన్‌స్పైర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తరగతి గదిలో బోధనకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన పెరిగేలా ఉపాధ్యాయులు వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఇంటింటా ఇన్నోవేషన్ పోటీల్లో ఎవరైనా పాల్గొనవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఇల్లెందు ఎంఈఓ పి.కృష్ణయ్య, నోడల్ అధికారి స్వామి, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'సీతారామ' పనుల్లో వేగం పెంచాలి

- డిస్ట్రిబ్యూషన్ కెనాళ్ల టెండర్ సిద్ధం చేయాలి
- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన రాయల నాగేశ్వరరావు

ములకలపల్లి : సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు, పూసుగూడెం శివారులోని పంప్‌హౌస్-2 ట్రయల్ రన్‌కు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతో కలిసి శనివారం రాగా, పనులు పూర్తి కాలేదు. దీంతో పంప్‌హౌస్‌ను సందర్శించిన మంత్రి మోటారు పనుల పురోగతి ఎలా ఉందని నీటిపారుదల శాఖ ముఖ్య సలహాదారు పెంటారెడ్డి, ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. 67 టీఎంసీల నీటి వసతికి సీడబ్ల్యూసీ క్లియరెన్స్ వచ్చిందని, ప్రస్తుతం 15 మిషన్లతో పనులు చేస్తున్నామని వారు మంత్రి దృష్టికి తేగా, మరో 10 మిషన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మూడు, నాలుగు రోజుల్లో పనులన్నీ పూర్తిచేయాలన్నారు. మెయిన్ కెనాల్ పూర్తవుతున్నందున యాతాలకుంట, ఏన్కూర్ మెయిన్ కెనాల్ వరకు డిస్ట్రిబ్యూటర్ కాల్వ నిర్మాణానికి టెండర్లు సిద్ధం చేయాలని చెప్పారు. అక్టోబర్ నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేసి, వచ్చే వ్యవసాయ సీజన్ నాటికి పనులు పూర్తి చేయాలన్నారు. పోడు పట్టాలు మంజూరు చేసిన భూములకు కూడా సాగు నీరు అందేలా చూడాలని ఐటీడీఏ పీఓ రాహుల్‌కు మంత్రి తుమ్మల ఫోన్‌లో సూచించారు. రోడ్డు పక్కనున్న భూముల్లో సాధ్యమైన వాటికి విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని, లేనివాటికి సోలార్ సిస్టమ్ కల్పించాలని చెప్పారు.

ములకలపల్లిలో ఆయిల్ పాం ఫ్యాక్టరీ..

ములకలపల్లి మండలంలో ఆయిల్‌పాం ఫ్యాక్టరీ ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి తుమ్మల హామీ ఇచ్చారు. స్థానిక నాయకులతో ఆయన మాట్లాడుతూ.. మండలంలో 10 వేల ఎకరాల్లో ఆయిల్ పాం సాగు చేసేలా చూడాలన్నారు. ఆ లక్ష్యం చేరకపోతే ఫ్యాక్టరీని పాల్వంచకు తీసుకెళ్తానని సున్నితంగా హెచ్చరించారు. మొదటి నుంచి తమ వెంట నడిచిన వారిని మర్చిపోవద్దని మంత్రి తుమ్మల నేతలకు సూచించారు. పూసుగూడేనికి చెందిన కార్యకర్త ఊట్ల కొండల్‌రావు ఎలా ఉన్నాడని ప్రశ్నించగా వెంటనే నాయకులు అతడిని పిలిపించారు. ఎలా ఉన్నావు, ఏం చేస్తున్నావంటూ తుమ్మల ఆయనను ఆత్మీయంగా పలకరించారు. కొండల్‌రావు కోయ భాషలో మాట్లాడగా, మంత్రి కూడా సరదాగా కోయ భాషలోనే సంభాషించారు. ఆయా కార్యక్రమాల్లో ఈఈ సురేశ్‌కుమార్, డీఈ మోతీలాల్, ఏఈలు గఫూర్‌పాషా, రామన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, నాయకులు పర్వతనేని అమర్‌నాథ్, బాల అప్పారావు, అడపా నాగేశ్వరరావు, కారం సుధీర్, కరుటూరి కృష్ణ, గద్దె రమేశ్, గుంపుల రవితేజ, పాలకుర్తి సుమిత్, ప్రతిమ కంపెనీ డిప్యూటీ మేనేజర్లు కేవీ.రమణారావు, కంటారెడ్డి అజయ్‌కుమార్‌రెడ్డి, తోట సుమన్, నాగిరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'స్వచ్ఛదనం'



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్

కొత్తగూడెంరూరల్: జిల్లాలో సోమవారం నుంచి ఈనెల 9 వరకు స్వచ్ఛదనం కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఎల్.భాస్కర్‌నాయక్ అన్నారు. జిల్లాలోని పీహెచ్‌సీల అధికారులతో శనివారం ఆయన జూమ్ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వచ్ఛదనం కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో డెంగీ, మలేరియా, ఐఈసీ ప్రచారం నిర్వహించడంతోపాటు, సీజనల్ వ్యాధుల కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించాలని సూచించారు. అన్ని మండలాలతో పాటు, పట్టణాల్లో ఫీవర్ సర్వే చేస్తామని, జ్వరాలు ఉన్నట్టు గుర్తించిన ప్రాంతాల్లో ఇంటెన్సివ్ క్లీనింగ్, యాంటీలార్వా, ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. దోమలు వృద్ధి చెందకుండా నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేయాలని, పట్టణాలు, పల్లెల్లో గంబూషియా చేపలు వేయాలని సూచించారు. సమావేశంలో ప్రోగ్రామ్ అధికారులు స్పందన, మధువరన్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో 132 మంది బదిలీ

- సంస్థ చరిత్రలో భారీ బదిలీలు ఇదే తొలిసారి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఏళ్ల తరబడి ఒకేచోట విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను బదిలీ చేస్తూ యాజమాన్యం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. తొమ్మిది విభాగాల్లో 132 మందిని బదిలీ చేయగా.. ఇంకొన్ని విభాగాల్లోనూ పలువురికి త్వరలో స్థానచలనం కల్పించనున్నట్లు తెలుస్తోంది. కాగా, బదిలీ అయిన వారిలో ఈఅండ్‌ఎంలో ముగ్గురు ఏజెంట్ కేడర్ అధికారులతో పాటు 73 మంది డీజీఎం నుంచి డిప్యూటీ ఎస్‌ఈ వరకు, పర్సనల్ విభాగం నుంచి 19 మంది, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ విభాగంలో 17 మంది, జియాలజీలో ఎనిమిది మంది, ఫారెస్ట్ విభాగంలో ఏడుగురు, ఎస్టేట్స్, సర్వే విభాగాల్లో ఇద్దరు చొప్పున ఉండగా, మెడికల్ విభాగంలో ఒకరు ఉన్నారు. కాగా, సింగరేణి చరిత్రలో ఇంత ఎక్కువ మందిని ఒకేసారి బదిలీ చేయడం ఇదే తొలిసారి అని చెబుతున్నారు.

రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

కొత్తగూడెంటౌన్: జిల్లాస్థాయి సీనియర్ అథ్లెటిక్స్ ఎంపికలు సోమవారం నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. పాల్వంచ శ్రీనివాసకాలనీలో ఉదయం 8 గంటల నుంచి ఎంపికలు జరుగుతాయని, 23 ఏళ్ల లోపు యువతీ యువకులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. 100, 400, 800, 1500, 3000, 5000 మీటర్ల పరుగుపందెం అంశాలలో పోటీలు ఉంటాయని వివరించారు. ఇక్కడ ప్రతిభ చాటిన వారిని ఈనెల 10వ తేదీన మెదక్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. వివరాలకు అథ్లెటిక్స్ కోచ్ పి.నాగేందర్ (99636 59598)ను సంప్రదించాలని కోరారు.

క్వారీల్లో బ్లాస్టింగ్‌పై నిఘా..

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచరూరల్: మండల పరిధి తోగ్గూడెంలోని క్వారీలలో బ్లాస్టింగ్ నిర్వహణపై ప్రత్యేక నిఘా పెట్టామని సీఐ వినయ్‌కుమార్ తెలిపారు. 'బ్లాస్టింగ్‌తో భయం...భయం' శీర్షికన శనివారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. క్వారీలో బ్లాస్టింగ్‌కు అనుమతుల్లేవని తెలిపారు. బ్లాస్టింగ్ జరుపుతున్నట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా క్వారీలో శక్తిమంతమైన పేలుడు పదార్థాలను వినియోగించి బ్లాస్టింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం



కలెక్టర్‌తో బాల బాలికలు, అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్‌కు చేసుకున్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఖమ్మం నుంచి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భూపాలపల్లి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీసీలో పాల్గొన్న కలెక్టర్.. ఆ తర్వాత అధికారులతో సమావేశమై మాట్లాడుతూ.. దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

అపరిశుభ్ర మరుగుదొడ్లను కూల్చేయాలి..

అపరిశుభ్ర మరుగుదొడ్లను కూల్చివేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు జిల్లాస్థాయి కమిటీ క్షేత్రస్థాయిలో విచారణ చేయాలని సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన విద్యార్థులు..

జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ స్కూళ్లకు ఎంపికైన 13 మంది బాలురు, 10 మంది బాలికలు అధికారులతో కలిసి శనివారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జూలై 9, 10 తేదీల్లో హకీంపేటలో జరిగిన రాష్ట్రస్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. భవిష్యత్‌లో క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎంపికైన బాల బాలికలకు నోట్ పుస్తకాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో డీఆర్‌డీఓ విద్యాచందన, డీపీఓ చంద్రమౌళి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి డి. అనసూర్య, సూపరింటెండెంట్ హన్మంతరావు, డీవైఎస్‌ఓ ఎం. పరంధామరెడ్డి, వివిధ శాఖల అధికారులు సైదులు, నరేష్, పీఈటీ ప్రేమ్ కుమార్, కె కృష్ణమోహన్ పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలకు ఎంపిక



అనితాజ్యోతిక

దమ్మపేట: మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన సోయం అనితా జ్యోతిక రాష్ట్ర స్థాయిలో క్రీడా పాఠశాలకు ఎంపికైంది. సోయం అనుక్, నాగలక్ష్మి దంపతుల కుమార్తె అయిన అనితాజ్యోతిక వెంకటాద్రిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. ఈ సందర్భంగా శనివారం కొత్తగూడెంలో విద్యార్థినిని కలెక్టరు జితేష్ వి పాటిల్ అభినందించారు. ఎంఈఓ కీసర లక్ష్మి తదితరులు కూడా అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

'సింగరేణి' అడ్మిట్ కార్డులు విడుదల

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ విడుదల చేసిన రెండో నోటిఫికేషన్ 2/2024కు సంబంధించిన అడ్మిట్ కార్డులను యాజమాన్యం విడుదల చేసింది. 7 విభాగాల్లో 327 పోస్టులకు ఈ నెల 6,7 తేదీల్లో హైదరాబాద్, సికింద్రాబాద్, వరంగల్, కరీంనగర్, సత్తుపల్లి, ఖమ్మంలలో 32 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. కంప్యూటర్ బేస్డ్ పరీక్ష నిర్వహించనుండగా 34,900 మంది అభ్యర్థులకు అడ్మిట్ కార్డులు విడుదల చేశారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డ్‌తో పాటు ఓటరు గుర్తింపు కార్డు/ డ్రైవింగ్ లైసెన్స్, కలర్ పాస్ పోర్టుసైజ్ ఫొటోలు, బాల్ పాయింట్ పెన్ను తీసుకుని పరీక్షకు రావాలని అధికారులు సూచించారు. రెండు రోజుల పాటు 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు, 12.30 నుంచి 2 గంటల వరకు, సాయంత్రం 4.30 గంటల నుంచి 6 గంటల వరకు మూడు షిఫ్టులుగా పరీక్ష నిర్వహించనున్నట్లు సింగరేణి అధికారులు పేర్కొన్నారు.


ఆదివాసీ యోధుల విగ్రహాలు పరిశీలన



విగ్రహాలను పరిశీలిస్తున్న ఏపీఓ డేవిడ్ రాజ్, ఆదివాసీ నాయకులు

భద్రాచలంటౌన్: ఆదివాసీ ఐక్యచరణ కమిటీ సభ్యులు, ఐటీడీఏ అధికారుల సమన్వయంతో పట్టణంలోని ఆదివాసీ యోధులు అల్లూరి సీతారామరాజు, మల్లు దొర, గంట దొర, కొమరం భీమ్, రాణి దుర్గాదేవి తదితరుల విగ్రహాలను శనివారం పరిశీలించారు. ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఐటీడీఏ ఏపీఓ డేవిడ్ రాజ్ విగ్రహాలను పరిశీలించి మాట్లాడారు. ఆదివాసీ దినోత్సవాన్ని తెలంగాణ ప్రభుత్వం తరఫున ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆదివాసీ కమిటీ సభ్యుల సూచనలను స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంఓ రమణయ్య, టీపీ శ్రీనివాస్, మేనేజర్ ఆదినారాయణ, పూనెం కృష్ణ, ముర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తాలిపేరు నుంచి 44 వేల క్యూసెక్కులు విడుదల



ప్రాజెక్ట్ నుంచి విడుదలవుతున్న వరదనీరు

చర్ల: ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో శనివారం ప్రాజెక్ట్‌కు చెందిన 25 గేట్లను ఎత్తి ఉంచి 44,373 క్యూసెక్కుల వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఉదయం 7 గంటలకు 18 గేట్లను ఎత్తి ఉంచి 29,558 క్యూసెక్కుల మేర వరదనీటిని విడుదల చేశారు. ఆ తర్వాత క్రమేపీ వరద ఉధృతి పెరగడంతో మరో 7 గేట్లను కూడా ఎత్తివేశారు. మొత్తం 25 గేట్లను ఎత్తి 44,373 క్యూసెక్కుల వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 74.00 మీటర్లు కాగా, ఎగువ నుంచి వచ్చే వరద ఉధృతి దృష్టిలో పెట్టుకుని నీటిమట్టాన్ని 73.07 మీటర్లుగా క్రమబద్ధీకరిస్తున్నారు.

కిన్నెరసానికి కొనసాగుతున్న వరద



కిన్నెరసాని జలాశయం

పాల్వంచరూరల్: ఎగువ ప్రాంతాల నుంచి కిన్నెరసాని జలాశయానికి వరదనీరు కొనసాగుతోంది. 407 అడుగుల నీటినిల్వ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 3,300 క్యూసెక్కుల వరదనీరు రావడంతో శనివారం నీటిమట్టం 404.40 అడుగులకు పెరిగింది. దీంతో ప్రాజెక్టుకు చెందిన ఒక గేటును ఎత్తిఉంచి 4 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,828

ఆపత్కాలంలో అండదండలు

▶ సహచరుల కుటుంబాలకు స్నేహితుల చేయూత ▶ అనారోగ్య పరిస్థితుల్లో చికిత్సకు ఆర్థిక సాయం ▶ స్నేహబంధాన్ని చాటుతున్న పలువురు



పాఠశాల.. కళాశాల.. ఉద్యోగం..ఇలా దశలు మారేకొద్దీ స్నేహితుల సంఖ్య పెరుగుతుంటుంది. ఎప్పటికప్పుడు జాబితాలోకి కొత్త స్నేహితులు వచ్చి చేరతారు. అయితే, ఏ స్థాయికి ఎదిగినా.. ఎక్కడ ఉన్నా చదువుకున్నప్పటి స్నేహాన్ని పలువురు కొనసాగిస్తున్నారు. శుభకార్యాలకు హాజరై సంతోషాన్ని పంచుకోవడమే కాక ఆపద ఎదురైనప్పుడూ అంతా కలిసి సహచరులకు అండగా నిలిచి మేమున్నామని స్నేహబంధాన్ని చాటుతున్నారు. నేడు స్నేహితుల దినోత్సవం సందర్భంగా అలాంటి బృందాల్లో కొన్నింటి వివరాలు ....

ఖమ్మం క్రైం/రఘునాథపాలెం/సత్తుపల్లి టౌన్/కల్లూరు/తల్లాడ

తల్లాడ జెడ్పీహెచ్‌ఎస్.. 1995-96

తల్లాడ జెడ్పీహెచ్‌ఎస్ 1995–96 బ్యాచ్ విద్యార్థులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈమేరకు ఇటీవల గుడిపల్లి సైదులు, దొనకొండ నరసింహారావు, ఎండీ.ఫిరోజ్ ఆధ్వర్యాన నగదు సేకరించి తమ స్నేహితురాలు కాంపల్లి వెంకటనరసమ్మ భర్త ముత్తయ్య చికిత్స కోసం రూ.30 వేలు అందించారు. అలాగే, తమతో చదివి మృతి చెందిన గుడిపల్లి బాలస్వామి, అంకోలు రామారావు కుటుంబాలకు రూ.20వేల చొప్పున, స్నేహితుడు బొడ్డు రామకృష్ణ భార్య చికిత్సకు రూ.20వేలు అందించడమేకాక ఆర్థికంగా వెనుకబడిన మరో మిత్రురాలికి రూ.20వేలు సమకూర్చారు.



ఐదేళ్లలో 67 కుటుంబాలకు చేయూత

రఘునాథపాలెం మండలం బూడిదంపాడుకు చెందిన మిత్రులు 2019లో హెల్పింగ్ హ్యాండ్స్ పేరుతో వాట్సాప్ గ్రూపు ఏర్పాటుచేసుకున్నారు. ఈ సందర్భంగా ఎవరైనా చనిపోయినా, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ఈ గ్రూప్ ద్వారా సమాచారం చేరవేసి తలా కొంత నగదు జమ చేస్తున్నారు. 2019 నుండి ఇప్పటి వరకు 67 మంది కుటుంబాలకు రూ.5.10 లక్షల ఆర్థిక సయం అందించడం విశేషం.



తల్లాడ జెడ్పీహెచ్‌ఎస్.. 1988-89



2023 మార్చిలో 1988–89 బ్యాచ్ తల్లాడ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు సమావేశమవగా పూర్వ ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలను ఆదుకోవాలని మొక్కా రాంబాబు, దగ్గుల కరుణాకర్‌రెడ్డి, పోలూరి నాగేశ్వర్‌రావు, సంపత్‌కుమార్ ఆధ్వర్యాన నిర్ణయించారు. దీంతో తల్లాడకు చెందిన దగ్గుల జితేందర్‌రెడ్డి మృతి చెందగా ఆయన కుటుంబానికి రూ.40 వేలు, బిల్లుపాడుకు తొర్లపాటి సంతోష్ భార్య అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుమార్తె చదువుల నిమిత్తం రూ.20 వేలు అందించి అండగా నిలిచారు.

సత్తుపల్లి ఎస్‌బీఎస్.. 1984-85



స్నేహితులెవరైనా ఆపదలో ఉంటే అండగా నిలుస్తున్నారు. సత్తుపల్లి శ్రీబండి శోభనాచలం హైస్కూల్(ఎస్‌బీఎస్) 1984–85 బ్యాచ్ పూర్వ విద్యార్థులు. ఈ బ్యాచ్‌కు చెందిన 25 మంది కలిసి తమ మిత్రుడి కుమార్తె వివాహానికి మేనమామల్లా నిలిచారు. 2020 మే 24న జరిగిన వివాహానికి రూ.1,31,500 సమకూర్చారు. అలాగే, మరో మిత్రుడు మృతి చెందగా 2021 మే 16న నిత్యావసర సరుకులతో పాటు రూ.31వేల నగదు అందించారు. ఈ బ్యాచ్‌లో ఎం.డీ.ముక్తార్, ఎం.డీ.షాకీర్, ఎం.డీ.షైబుద్దీన్, ఆర్.శ్రీను, ఎం.డీ.రియాజుద్దీన్ తదితరులు ఉన్నారు.

ఊపిరి పోయాక ఉత్తుత్తి వైద్యం ?

భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఘటన



మృత శిశువుని పట్టుకుని రోదిస్తున్న తండ్రి కన్నారావు

భద్రాచలంఅర్బన్ : ప్రాణం పోయిన శిశువుకు ఐదు గంటల పాటు ఉత్తుత్తి చికిత్స అందించిన ఓ ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులు.. ఠాగూర్ సినిమాను మైమరిపించారు. భద్రాచలంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలిలా.. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం గంగన్నమెట్ట గ్రామానికి చెందిన కన్నారావు, నాంచారమ్మ దంపతులకు మూడు నెలల క్రితం చింతూరు ప్రభుత్వ ఆస్పత్రిలో మగ శిశువు జన్మించాడు. ఆ తర్వాత శిశువు నిమ్ము సమస్యతో బాధపడుతున్నాడని వైద్యులు చెప్పడంతో కన్నారావు దంపతులు భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అయితే ఈనెల 1న శిశువు జలుబు, దగ్గుతో బాధపడుతుండగా మళ్లీ అదే ఆస్పత్రికి తీసుకొచ్చారు. రెండు రోజుల పాటు చికిత్స చేసిన వైద్యులు శనివారం ఉదయం.. శిశువు ఆరోగ్యం బాగాలేదని, మరో ఆస్పత్రికి తీసుకెళ్లమని చెప్పారు. దీంతో పక్కనే ఉన్న మరో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సాయంత్రం 5 గంటలకు.. ఆరోగ్యం మరింతగా క్షీణించిందని, మందులు తీసుకురమ్మని కన్నారావుకు వైద్యులు చెప్పారు. ఆ తర్వాత పది నిమిషాలకే శిశువు మృతి చెందాడని నిర్ధారించారు. అయితే.. శనివారం ఉదయమే తమ కుమారుడు మృతి చెంది ఉంటాడని, ఈ విషయం తమకు చెప్పకుండా బతికే ఉన్నట్టుగా నమ్మించిన వైద్యులు ఠాగూర్ సినిమాలోలా కట్టుకథ అల్లారని కన్నారావు, నాంచారమ్మ ఆరోపిస్తున్నారు. తమకు గతంలో కూడా ఇద్దరు పిల్లలు పుట్టి మరణించారని, ఇప్పుడు మూడో సంతానం కూడా దక్కకుండా పోయిందని వారు విలపిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. ఇదిలా ఉండగా ఈ ఘటన బయటకు పొక్కకుండా ఉండేలా సదరు ఆస్పత్రి యాజమాన్యంతో పాటు ఓ ప్రభుత్వ అధికారి మధ్యవర్తుల ద్వారా కన్నారావు దంపతులకు కొంత నగదు అప్పగించారని తెలిసింది. ఆ తర్వాత మృత శిశువును కన్నారావు కుటుంబసభ్యులు అంబులెన్స్‌లో గంగన్నమెట్టకు తరలించారు. కాగా, ఆస్పత్రి వైద్యులను వివరణ కోరగా, తాము వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తుండగానే మృతి చెందాడని, మృత శిశువుకు వైద్యం చేయాల్సిన అవసరం తమకు లేదని చెప్పారు.

ఉపాధ్యాయుడి మృతికి యూటీఎఫ్ సంతాపం

మణుగూరు టౌన్: ప్రభుత్వ ఉపాధ్యాయుడు నిట్ట రాంబాబు శనివారం గుండెపోటుతో మృతి చెందగా, టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కారం సీతారామయ్య, షేక్ మీరా హుస్సేన్, సంఘం సభ్యులు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చి సానుభూతి తెలిపారు. సంతాపం తెలిపినవారిలో వజ్జా కృష్ణమూర్తి, కుమారస్వామి, స్వర్ణజ్యోతి, భాస్కరరావు, ఐలయ్య తదితరులు ఉన్నారు.

బొగ్గు బ్లాకులు సింగరేణికే కేటాయించాలి

సింగరేణి పరిరక్షణ బస్సు యాత్రలో సీపీఎం నేతలు



ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

మణుగూరు టౌన్: బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని సీపీఎంరాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య డిమాండ్ చేశారు. శనివారం సింగరేణి పరిరక్షణ బస్సు యాత్ర సందర్భంగా తొలుత మణుగూరు సీపీఎం ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో సమావేశం జరిపారు. ఓసీ–2, ఓసీ–4, కేసీహెచ్‌పీ పంచ్‌ఎంట్రీ ప్రాంతాల్లో బస్సు యాత్ర ద్వారా పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనుల వేలం ఆపాలని, బొగ్గు బ్లాకుల సాధన కోసం సింగరేణి పరిరక్షణ యాత్ర చేపట్టామని తెలిపారు. మోదీ ప్రభుత్వం గత బీఆర్‌ఎస్ పాలనలోనూ ప్రైవేట్ సంస్థలకు బొగ్గు బ్లాకులు అప్పగించిందని ఆరోపించారు. కార్మిక బిడ్డలకు అన్యాయం జరగకుండా ఉండాలంటే శ్రావణపల్లి బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని, గతంలో ఇచ్చిన రెండు బ్లాకులను తక్షణమే తిరిగి సింగరేణికి అప్పగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అఖిలపక్షాన్ని కలుపుకుని కేంద్రంపై ఒత్తిడి తేవాలని, రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు, సీఐటీయూ జిల్లా కారదర్శి ఏజే రమేష్, అన్నవరపు కనకయ్య, సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి వల్లూరు వెంకటరత్నం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల శ్రీనివాస్, నాయకులు సత్రపల్లి సాంబశివరావు, మాచారపు లక్ష్మణరావు, నందం ఈశ్వర్‌రావు, టీవీఎంవీ ప్రసాద్, సీపీఎం మండల కార్యదర్శి కొడిశాల రాములు, ఉప్పతల నర్సింహారావు, రామ్మూర్తి, నల్లెల విల్సన్, లక్ష్మణరావు, బొల్లం రాజు, పిట్టల నాగమణి, తోట పద్మ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ అపహరిస్తే.. జీపీఎస్‌తో పట్టేశారు

మణుగూరు టౌన్: కాంటా వద్ద నిలిపి ఉంచిన లారీని అపహరిస్తున్న వ్యక్తిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన మణుగూరులో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... పట్టణంలోని సీఎస్పీ కాంటాకు సమీపంలో నిలిపి ఉంచిన 14 చక్రాల టిప్పర్ లారీని ఓ వ్యక్తి దొంగిలించుకుని తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో జీపీఎస్ ద్వారా గుర్తించి యజమాని కొండాయిగూడెం వద్ద పట్టుకున్నాడు. లారీ యజమానులు దొంగకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

అమ్మవారి ఆలయంలో చోరీ

కొత్తగూడెంటౌన్: అమ్మవారి ఆలయంలో చోరీ జరిగింది. శనివారం తెల్లవారు జామున రుద్రంపూర్ బస్టాండ్ సమీపంలోని శ్రీస్వర్ణదుర్గ మాతా అమ్మవారి ఆలయంలో అమ్మవారి విలువైన వస్తువులు, హుండీలోని నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. ఉదయం పూజల కోసం వెళ్లిన ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు గమనించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అమ్మవారి విగ్రహానికి అమర్చిన వెండి కండ్లు, వెండి త్రిశూలం, హుండీలోని రూ.20 వేల వరకు ఉన్న నగదు చోరీ చేసినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

మైనర్లకు బండి ఇస్తే ఓనర్లపై కేసులు

కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

కొత్తగూడెంఅర్బన్/కొత్తగూడెంటౌన్: మైనర్లకు వాహనాలు ఇస్తే ఓనర్లపై కేసులు నమోదు చేస్తామని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ పేర్కొన్నారు. శనివారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. నంబర్ ప్లేట్, లైసెన్స్‌లు లేకుండా వాహనాలతో తిరగడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. శబ్దం ఎక్కువగా వచ్చే సైలెన్సర్లు వాడొద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ ఎం.కరుణాకర్, ట్రాఫిక్ ఎస్సైలు నరేష్, మదార్, ఎస్సై విజయ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

అవగాహన సదస్సులు నిర్వహించాలి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ విద్యాచందన

కొత్తగూడెంఅర్బన్: ప్రజా ఆరోగ్యం, పరిశుభ్రతలపై తరచూ అవగాహన సదస్సులు నిర్వహించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ విద్యాచందన సూచించారు. కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛదనం–పచ్చదనంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మున్సిపాలిటీలోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలన్నారు. ప్రజలు, మహిళా సంఘాలు, కౌన్సిలర్లు సమన్వయంతో ఈ నెల 5 నుంచి 9 తేదీ స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ శేషంజన్‌స్వామి, వైద్యశాఖ ప్రోగ్రాం అధికారి స్పందన, వార్డు కౌన్సిలర్లు, మెప్మా టీడీఎంసీ రాజేష్, టీఎంసీబీ వెంకటేశ్వర్లు, సీఓలు, ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్ మాక్‌డ్రిల్ విజయవంతం



బోటులో వెళ్తున్న ఓఎస్డీ పరితోష్ పంకజ్ తదితరులు

సుజాతనగర్: సింగభూపాలెం చెరువు వద్ద శనివారం నిర్వహించిన డ్రోన్ మాక్ డ్రిల్ విజయవంతమైంది. వరదలు, విపత్కర పరిస్థితుల్లో చిక్కుకున్న వారికి డ్రోన్ ద్వారా లైఫ్ జాకెట్లు, ఆహార సామగ్రిని అందించే తీరును అధికారులు పరిశీలించారు. జిల్లాలో ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి ప్రత్యేకంగా శిక్షణ పొందిన డీడీఆర్ఎఫ్ బృందం సిద్ధంగా ఉందని పోలీస్ అధికారులు తెలిపారు. గోదావరి వరదల సమయంలో ముంపు ప్రాంత ప్రజలను సంరక్షించేందుకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. కొత్తగూడెం ఓఎస్డీ పరితోష్ పంకజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టగా, చుంచుపల్లి సీఐ ఆర్.వెంకటేశ్వర్లు, ఎస్సై జుబేదాబేగం తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

పాల్వంచ: షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధమైన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... పట్టణంలోని వెంగళరావు కాలనీకి చెందిన కూలి అలవాల సోమయ్య ఇంట్లో అర్ధరాత్రి సమయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి భారీగా పొగ, మంటలు వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు మేల్కొని చుట్టుపక్కల వారి సహాయంతో నీళ్లు చల్లి మంటలను ఆర్పివేశారు. అయితే ఇంట్లోని టీవీ, ఫ్యాన్‌లు, సెల్‌ఫోన్‌లు, విలువైన వస్తువులు, పిల్లల పుస్తకాలు, రూ.10 వేల నగదు దగ్ధమయ్యాయి. రూ.1.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత వృద్ధ దంపతులు సోమయ్య, శ్యామల కోరుతున్నారు.



దగ్ధమైన ఇంట్లోని వస్తువులు

చెక్ బౌన్స్ కేసులో వ్యక్తి అరెస్ట్

అశ్వాపురం: చెక్ బౌన్స్ కేసులో కోర్టుకు హాజరు కాకపోవడంతో ఓ వ్యక్తిని శనివారం అశ్వాపురం పోలీసులు అరెస్ట్ చేశారు. మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కొర్సా దుర్గారావు చెక్ బౌన్స్ కేసులో పలుమార్లు కోర్టుకు హాజరు కాకపోవడంతో కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. దీంతో అరెస్ట్ చేసి భద్రాచలం సబ్ జైలుకు తరలించినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

తాలిపేరు ప్రాజెక్ట్‌లో మహిళ మృతదేహం

చర్ల: కుళ్లిపోయిన స్థితిలో ఉన్న సుమారు 35 యేళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని మహిళ మృతదేహం కొట్టుకొచ్చి తాలిపేరు ప్రాజెక్ట్ గేట్ల వద్ద చిక్కుకోగా ఏఈ ఉపేందర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ రాజువర్మ, ఎస్సై నర్సిరెడ్డి అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉండడంతో బయటకు తీయించి ప్రాజెక్ట్ సమీపంలో ఖననం చేయించి కేసు నమోదు చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన మహిళ అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

ఇల్లెందు: ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన జి. మోతీలాల్(49) మద్యానికి బానిసగా మారటంతో కుటుంబంలో వివాదం తలెత్తింది. దీంతో మద్యం మత్తులో పురుగుల మందు తాగి మృతి చెందాడు. మృతుడి కుమారుడు వీరన్న ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పశువులు పట్టివేత

ఇల్లెందు: మండలంలోని పోలారం పంచాయతీ భద్రు తండా నుంచి నాలుగు శాల్తీలు పశువులను కబేళాకు తరలిస్తుండగా శనివారం పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్ కృష్ణ మీద కేసు నమో దు చేసి, పశువులను గోశాలకు తరలించినట్లు సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనగా మొండికుంట గ్రామానికి చెందిన మేరెడ్డి చలపతిరెడ్డికి కాలు విరగగా, భద్రాచలానికి చెందిన ఇద్దరు యువకులకు గాయలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

గుండాల: మద్యం మత్తులో వేగంతో వస్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన ఆళ్లపల్లి మండలంలో శనివారం జరిగింది. ఆళ్లపల్లి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన గొగ్గెల సురేష్ మర్కోడు నుంచి వెంకటాపురం వెళుతుండగా ఆళ్లపల్లి సమీపంలోని మొద్దుల చెరువు వద్ద బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో ఆ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి 108 ద్వారా ఆళ్లపల్లి ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తరలించారు.

అధికారుల అండదండలతోనే..

టౌన్‌ప్లానింగ్ నియామకాల్లో వారే కీలకం?

ఖమ్మంమయూరిసెంటర్: వడ్డించే వాడు మన వాడైతే బంతిలో ఎక్కడ కూర్చున్న అన్నీ అందుతాయనే నానుడి ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో నిజమవుతోంది. అధికారుల అండదండలతో కాలపరిమితి ముగిసినా.. కొందరు ఉద్యోగంలో కొనసాగుతుండగా.. కౌన్సిల్, మేయర్ అనుమతి లేకున్నా వేతనాలు అందుతున్నాయి. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లోని టౌన్ ప్లానింగ్ విభాగంలో ఎల్‌ఆర్‌ఎస్ పనుల కోసం గతంలో పది మంది సిబ్బందిని అధికారులు నియమించుకున్నారు. ఆ సమయాన కనీసం మేయర్ ఆమోదం కూడా లేకపోగా, వారి విషయమై కేఎంసీలో ఇటీవల జరుగుతున్న చర్చతో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఎల్‌ఆర్‌ఎస్ పని పూర్తయ్యాక తొలగించకపోగా ఏ విధానంలో వారిని నియమించరో తెలియకుండా అగ్రిమెంట్లపై సంతకాలు చేసిన అధికారుల తీరు విమర్శలు తావిస్తోంది.

నియామకం ఒకటి.. పని మరొకటి..

ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించి దరఖాస్తుల పరిశీలన కోసం టౌన్‌ప్లానింగ్ అధికారులు పది మందిని నియమించగా అందులో ఇప్పుడు తొమ్మిది మంది కొనసాగుతున్నారు. వీరిని రోజువారీ వేతనంపై నియమించినట్లు చెబుతున్నా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన కాకుండా ఇతర పనులు అప్పగించినట్లు సమాచారం. దీంతో ఒకరిద్దరు తమను నియమించిన అధికారుల అండతో చెలరేగిపోతున్నట్లు తెలిసింది. అయితే, వీరి నియామకాలు, వేతనాల చెల్లింపు అగ్రిమెంట్లపై అధికారుల సంతకాలు తప్ప మేయర్ సంతకం కానీ కౌన్సిల్ ఆమోదం కానీ లేదు. దీంతో వేతనాల చెల్లింపు కోసం ఓ అధికారి వద్దకు ఫైల్ వెళ్లిన సందర్భంలో వెనక్కి పంపితే ఇన్నాళ్లు ఎలా సంతకం పెట్టారని ఇంకో అధికారి నిలయడంతో వాగ్వాదంజరిగినట్లు సమాచారం. ఇదే సమయాన అధికారులు కమిషనర్‌ను తప్పుదోవ పట్టించి సంతకాలు చేయించారనే చర్చ జరుగుతుంది. కాగా, నియామకాలపై మేయర్ విచారణ చేయించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. కానీ అధికారులు మాత్రం 'మీకేం కాదు.. మేం చేసుకుంటాం ' అని సిబ్బందికి ధైర్యం చెబుతున్నట్లు సమాచారం.